క్లుప్తంగా

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నిక

డోర్నకల్: స్థానిక జైన్‌భవన్‌లో నిర్వహించిన మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నిక సోమవారం జరిగింది. 57 మంది ఫొటోగ్రాఫర్లు ఓటుహక్కును వినియోగించుకోగా 23 ఓట్ల మెజారిటీతో మండల అధ్యక్షుడిగా ముద్దం భాస్కర్ విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా గుగులోత్ రవికుమార్, కోశాధికారిగా పి.కొండల్‌రావు విజయం సాధించారు. ఎన్నికల అధికారులుగా పోటు శేఖర్, ఎంఏ అజీమ్, తలారి భాస్కర్ వ్యవహరించారు.

దీప్తి జివాంజీకి సన్మానం

మహబూబాబాద్ అర్బన్ : పారా ఒలంపిక్స్ 2024లో బ్రాంజ్ మెడల్ సాధించిన దీప్తి జివాంజీకి జిల్లా కేంద్రానికి చెందిన మయూరి జువెలర్స్ యాజమాన్యం శేషగాని మమతా సుధాకర్, గండి వినోదలు సోమవారం సన్మానించి వినాయక ప్రతిమను అందజేశారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

నెల్లికుదురు: నిత్యం మురుగు కాల్వలు, చెత్త చెదారం పనులను చేపట్టే గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలు పరిష్కరించి, 6 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించకుంటే నిరవధిక సమ్మెకు వెళ్తామని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లం ఎల్లయ్య అన్నారు. ఈ మేరకు ఎంపీడీఓ బాలరాజులకు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు.

సమ్మె నోటీసు అందజేత

కురవి : గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు సోమవారం స్థానిక ఎంపీడీఓ వీరబాబుకు సమ్మె నోటీసు అందజేశారు.

ఎక్సైజ్ పోలీసుల తనిఖీలు

డోర్నకల్ : మండలంలోని తొడేళ్లగూడెం, ముల్కలపల్లి గ్రామాల్లో సోమవారం మహబూబాబాద్ ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించి నాటుసారా స్వాధీనపర్చుకున్నారు. ఎక్సైజ్ ఎస్సై మౌనిక కథనం ప్రకారం.. నాటుసారా విక్రయిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి తొడేళ్లగూడెంలో షేక్ అఫ్జల్,నాగమ్మ వద్ద నాలుగు లీటర్లు, ముల్కలపల్లిలో షేక్ ఫాతిమా, నాగయ్య వద్ద 4 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విజయవంతం చేయాలి

నెల్లికుదురు : ఆదివాసీలపై జరుగుతున్న హత్యాకాండను తక్షణమే నిలిపి వేయాలని డిమాండ్ చేస్తు ఈ నెల 20న ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో మహబూబాబాద్‌లో చేపట్టే సదస్సును విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు ఆశోద యాకూబ్ కోరారు. మండల కేంద్రంలో సోమవారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. యాకయ్య, వెంకన్న, శ్రీను, ఉప్పలయ్య, యాకయ్య పాల్గొన్నారు.

రాత్రి వేళల్లో ఇసుక అనుమతులు ఎలా?

చిన్నగూడూరు : రాత్రి వేళల్లో ఇసుక అనుమతులు ఎలా ఉంటాయని మండలంలోని గుండంరాజుపల్లి గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుండడంతో ట్రాక్టర్ శబ్దాలతో ఇబ్బందులు పడుతున్నామంటూ గ్రామస్తులు ఆదివారం రాత్రి ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. రాత్రి సమయంలో ఇసుక తరలింపు ఎవరు ఇచ్చారంటూ రోడ్డుకు అడ్డంగా రాళ్లు పెట్టి ట్రాక్టర్లను ఆపారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

డోర్నకల్/తొర్రూరు రూరల్: విత్తనాల కొనుగోలు సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని సీరోలు మండల వ్యవసాయ అధికారులు ఛాయారాజ్, రాంనర్సయ్య కోరారు. సోమవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం యాసంగి వరికోతలు పూర్తవుతున్నందున రైతులు వానాకాల పంటలకు సిద్ధమయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. రైతులు గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు.

పాకాలేటిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి



గార్ల : మండలకేంద్రం నుంచి రాంపురం, మద్దివంచ పంచాయతీలకు రాకపోకలు కొనసాగించేందుకు పాకాలేటిపై హైలెవల్ బ్రిడ్జిని నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ్‌సారథి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గార్లలో నిర్వహించిన ఆ పార్టీ మండల సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక ఏళ్లుగా పాలకులు బ్రిడ్జి నిర్మాణంపై హామీలు ఇస్తూ పాలకులు మారుతున్నారే తప్ప ప్రజల ఇబ్బందులు తొలగటం లేదన్నారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్, వెంకన్న, కృష్ణమూర్తి, నరసింహారావు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- జడలు విప్పుతున్న వ్యాపారం
- పట్టించుకోని అధికారులు

మరిపెడ రూరల్ : కొద్ది రోజులగా స్తబ్ధతగా ఉండి ఇసుక అక్రమ రవాణాతో మళ్లీ గ్రామాల్లో అలజడి మొదలైంది. ఇందిరమ్మ గృహాల నిర్మాణాలకు ఇసుక అవసరమని, అందుకు ఆకేరు, పాలేరు వాగులోని ఇసుక తరలింపునకు అధికారులు అడ్డుకట్ట వేశారు. ఎవరైనా ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని రెవెన్యూ, పోలీస్ శాఖల నుంచి హెచ్చరికలు జారీ చేయడంతో కొద్ది రోజులుగా ఇసుక రవాణా ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ఏమి జరిగిందో ఏమో తెలియదు గానీ మళ్లీ గ్రామాల్లో అనుమతి లేని ఇసుక రవాణా ట్రాక్టర్ల అలజడి మొదలైంది. పదుల సంఖ్యలో ఇసుక ట్రాక్టర్లు మరిపెడ పట్టణానికి ఇసుక రవాణా చేస్తున్నారు. కళ్లముందు నుంచి వెళ్తున్నా సంబంధిత అధికారులు కన్నెత్తి చూడడం లేదు. మండలంలోని పాలేరు, ఆకేరు వాగు పరివాహక ప్రాంత గ్రామాలైన తానంచర్ల, తాళ్లఊకల్, రాంపురం, తండధర్మారం, ఉల్లెపల్లి, బాల్నిధర్మారం, బీచ్‌రాజ్‌పల్లి గ్రామాలతో పాటు పలు గిరిజతండాల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. అధికారులు తక్షణమే స్పందించి అనుమతి లేని ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని, లేని క్రమంలో ఇసుక కొరత ఏర్పడి పేదలు ఇళ్లు నిర్మించుకోలేని దుస్థితి తలెత్తుందని మండల ప్రజలు హెచ్చరిస్తున్నారు.



తానంచర్ల నుంచి మరిపెడకు తరలిస్తున్న అనుమతి లేని ఇసుక ట్రాక్టర్

భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి



మూలమర్రి గ్రామ శివారు పాలేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండడంతో వాగు పరివాహక ప్రాంత గ్రామంలో భూ గర్భజలాలు అడుగంటుతున్నాయి. అదేవిధంగా రాత్రింబవళ్లు ఇసుక ట్రాక్టర్లు తిరుగుతుండంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

– బానోతు వెంకన్న, మూలమర్రితండ

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం

- ఎంపీ కడియం కావ్య

పెద్దవంగర: సామాజిక సేవే లక్ష్యంగా నిర్విరామంగా లయన్స్‌క్లబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని వరంగల్ ఎంపీ కడియం కావ్య కొనియాడారు. సోమవారం స్థానిక లయన్స్‌క్లబ్ కమ్యూనిటీ హాల్ నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా లయన్స్‌క్లబ్ ప్రజలకు ఎన్నో సేవలు అందిస్తుందని గుర్తు చేశారు. తన ఎంపీ నిధుల నుంచి లయన్స్‌క్లబ్ అభివృద్ధికి రూ.5 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామీణా ప్రాంతాల్లో నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు లయన్స్‌క్లబ్ ఎలల్ల వేళలా కృషి చేస్తుందని, ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ డిస్టిక్ గవర్నర్ వెంకట్ రెడ్డి, పూర్వపు జిల్లా గవర్నర్ డాక్టర్ రాజేందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, జోన్ చైర్మన్ శ్రీదేవి, పెద్దవంగర లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, రేణుక, మాజీ కార్పోరేటర్ మాధవి బపాల్గొన్నారు.



భూమి పూజలో పాల్గొన్న ఎంపీ కడియం కావ్య

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు సమన్యాయం

- మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్

గూడూరు: కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న అధ్యక్షతన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ కార్యకర్తలతో రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలు రెచ్చగొడుతూ, రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో ఏర్పడిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలను అందిస్తుందని, వాటిని జీర్ణించుకోలేని కొన్ని పార్టీలు అడ్డంకులు సృష్టిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మాధవపెద్ది ప్రదీప్‌రెడ్డి, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్‌రెడ్డి, నాయకులు కొమ్మాలు, వీరస్వామి, శ్రీపాల్‌రెడ్డి, పద్మ, మధుగౌడ్, సంపత్, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

నెహ్రూసెంటర్ : జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని, జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. జర్నలిస్టు కాలనీ, జయశంకర్ కాలనీలో ఎమ్మెల్సీ నిధుల నుంచి రూ.18 లక్షలతో చేపట్టనున్న విద్యుత్‌లైన్ పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజుల్లో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రాంమోహన్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, ఖన్న, వేణు, రమేష్, ఖలీల్, విద్యుత్‌శాఖ డీఈ పెద్ది రాజం, ఏడీఈ ప్రశాంత్, ఏఈ నవ్యశ్రీ, జర్నలిస్టులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

చలివేంద్రం ఏర్పాటుపై హర్షం

మరిపెడ : వేసవి కాలంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని డీఎస్పీ కొండం పార్థసారథి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ కేంద్రంలో మచ్చ సోమయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు మజ్జిగ చలివేంద్రాన్ని ఆర్యవైశ్య సంఘం పర్యవేక్షణలో ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన సూర్యాపేట డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న మరిపెడ మండలం ఎల్లంపేటకు చెందిన కొండం పార్థసారధి మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. మహబూబాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభల అధ్యక్షుడు వెంకటరామారావు, వెంకటనర్సు, హరిప్రసాద్, మధు, తల్లాడ సురేష్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

మహబూబాబాద్: చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్ కోరారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని వివేకానంద సెంటర్, మదర్ థెరిస్సా సెంటర్, కూరగాయల మార్కెట్ ఎదుట, తొర్రూరు బస్టాండ్ సెంటర్‌లో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎండతీవ్రత ఉన్న సమయంలో అవసరమైతే తప్ప బయటికి రావద్దని సూచించారు.

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు

మరిపెడ రూరల్ : వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని జనవికాస సంస్థ సెంటర్ కో–ఆర్డినేటర్ గంధసిరి ఉపేంద్ర అన్నారు. సోమవారం స్టేజితండ గ్రామ పంచాయతీ పరిధిలో కోనేటి మణెమ్మ భర్త వెంకన్న జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఉపేంద్ర ప్రారంభించారు.

జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్ : కేంద్రంలోని మోదీ సర్కార్ అనుసరిస్తున్న కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నేడు (మంగళవారం) సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో నిరసన దినంను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమంపై సోమవారం ప్రచారం నిర్వహించారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

పెద్దవంగర: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యంను విక్రయించి మద్దతు ధర పొందాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కొనుగోలు కేంద్రం నిర్వాకులకు సూచించారు. అనంతరం చిట్యాల ప్రాథమిక పాఠశాలకు దాత రావుల వెంకటరంగారెడ్డి రూ. 50 వేల విలువ చేసే ఆర్వో వాటర్ ప్యూరిఫయర్‌ను బహూకరించగా పాఠశాల హెచ్ఎం యాకయ్యతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో తొర్రూరు ఏఎంసీ చైర్మన్ తిరుపతిరెడ్డి, నాయకులు ముద్దసాని సురేష్, కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, జాటోతు నెహ్రూనాయక్, ఏఎంసీ సభ్యులు గోపాల్ నాయక్, పూర్ణచందర్, అధికారులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

మహిళల అభివృద్ధికి పెద్దపీట

- ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్



మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్

దంతాలపల్లి : రాష్ట్రంలోని మహిళల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నాడని ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ అన్నారు. హైకోర్టు న్యాయవాది జెట్టి ఆజాద్ చంద్రశేఖర్ ఏర్పాటు చేసిన మహిళల కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని వారికి ధ్రువీకరణ పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుట్టుమిషన్ నేర్చుకున్న మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి రుణాలు అందేలా చూస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన మహిళలకు బ్యాంకుల ద్వారా రుణం అందిస్తూ ప్రోత్సహిస్తున్నామన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

బీరిశెట్టిగూడెంలో అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభించారు. కేంద్రానికి కావలసిన అన్ని వసతులు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ ఎల్లమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుధారాణి, తహసీల్దార్ రాజేశ్వర్, ఎంపీడీఓ వివేక్ రామ్, ఎంపీఓ అప్సర్ పాషా, హైకోర్టు న్యాయవాది ఆజాద్ చంద్రశేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బట్టునాయక్, నాయకులు పాల్గొన్నారు.

చిన్నతనం నుంచి కష్టపడి చదవాలి

విద్యార్థులు చిన్నతనం నుంచి కష్టపడి చదివినప్పుడే జీవితంలో విజయ తీరాలను చేరగలుగుతారని విప్ రామచంద్రానాయక్ అన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ 20 ఏళ్లు కష్టపడి చదివితే 80 ఏళ్లు రాజా లాగా జీవించవచ్చన్నారు. ఏఎంఓ ఆజాద్ చంద్రశేఖర్, ఎంఈఓ శ్రీదేవి, ప్రధానోపాధ్యాయులు వేణుమాధవరెడ్డి, కృష్ణయ్య, మధుసూదన్, తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్, ఎంపీడీఓ వివేక్ రామ్, ఎంపీఓ అప్సర్‌పాషా పాల్గొన్నారు.

దేశానికి అంబేడ్కర్ దిక్సూచి

- మాజీ ఎంపీ సురేందర్‌రెడ్డి

మరిపెడ రూరల్ : రాజ్యాంగం రూపొందించడం ద్వారా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారతదేశానికి ఓ దిక్సూచిగా నిలిచారని మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తానంచర్లలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో దళిత కాలనీలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. సీత వెంకన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ 1965లో తాను ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు నాకు 90 శాతం ఓటింగ్ నమోదైందన్నారు. రాజకీయ పార్టీలు గానీ, నాయకులు గానీ వారికి కష్టం వచ్చినప్పుడు మాత్రమే అంబేడ్కర్‌ను వాడుకోవడం జరిగిందే తప్ప మిగిలిన సమయంలో వారు పట్టించుకోవడం మర్చిపోతారన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణరెడ్డి, పురుషోత్తంరెడ్డి, ఎంఈఓ అనితాదేవి, అభినవ్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ యాదగిరిరెడ్డి, డీఈ రాములునాయక్, ప్రభాకర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, రాంలాల్, మెంచ్ అశోక్‌రెడ్డి, షేక్ అఫ్జల్, శ్రీపాల్‌రెడ్డి, పాశం నరేష్‌రెడ్డి, ప్రసాద్, భద్రయ్య, ఉపేందర్, అంబేడ్కర్ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ ఆర్.సురేందర్‌రెడ్డి

సంక్షిప్త సమాచారం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

మరిపెడ రూరల్ : రోడ్డు పక్కన ఉన్న సూచిక బోర్డును ఓ ట్రాలీ ఆటో ఢీ కొట్టిన సంఘటనలో తండ్రికి తీవ్ర గాయాలు కాగా కూతురు క్యాబిన్‌లో ఇరుక్కుని గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని బుర్హాన్‌పురం గ్రామ సమీపంలోని మహబూబాబాద్–సూర్యాపేట 365 జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. కొత్తగూడెం గ్రామానికి చెందిన తండ్రి హబీబ్, కూతురు రజియాబేగం కొంతకాలంగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ఇంటిని ఖాళీ చేసి స్వగ్రామమైన కొత్తగూడేనికి ఓ ట్రాలీ ఆటోలో ఇంటి సామాను తీసుకొని మరో ఇద్దరు యువకులు శ్రావణ్, ఆదాంపాషాలతో కలిసి మరిపెడ మీదుగా కొత్తగూడెం పట్టణానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో బుర్హాన్‌పురం గ్రామ సమీపంలో ట్రాలీ ఆటో డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోగానే ట్రాలీ అదుపుతప్పి సూచిక బోర్డును బలంగా ఢీ కొట్టింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

పీఎంశ్రీ పథకం విద్యార్థులకు వరం

పెద్దవంగర : పీఎం శ్రీ పథకంతో విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేస్తుందని జిల్లా క్వాలిటీ కో ఆర్డినేటర్ ఆజాద్ పేర్కొన్నారు. మండలంలోని అవుతాపురం పీఎంశ్రీ జెడ్పీ ఉన్నత పాఠశాల్లో సోమవారం పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు.

శ్రీకాంత్ మృతి బాధాకరం

గార్ల : సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎర్ర శ్రీకాంత్ మృతి బాధాకరమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలువాల సత్యవతి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన శ్రీకాంత్ సంతాపసభను ఉద్దేశించి వారు మాట్లాడారు.

సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్ : జీపీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఎంపీడీఓ రఘుపతిరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ ధర్మారపు సుధాకర్ మాట్లాడారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

దంతాలపల్లి : అర్హులైన వారికి మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు అందేఆ చూస్తామని తహ సీల్దార్ రాజేశ్వర్ అన్నారు. మండలంలోని బీరిశెట్టిగూడెంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నిర్వహించిన సర్వేలో ఎవరైనా రెండు పడుక గదుల ఇండ్లు, లేదా ఇందిరమ్మ ఇళ్లు వచ్చిన వారు ఉన్నట్‌లెతై వారి పేరు ఎలా వచ్చింది అని పరిశీలిస్తామన్నారు.

రన్నింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలి

డోర్నకల్ : రైల్వే రన్నింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక రైల్వే స్టేషన్ క్రూ లాబీ ఎదుట రైల్వే ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. సోమవారం సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్ డోర్నకల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో రన్నింగ్ స్టాఫ్ ఉద్యోగులైన డ్రైవర్లు, గార్డులు ధర్నా నిర్వహించారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

తొర్రూరు : ప్రతి ఒక్కరు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తొర్రూరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుగుణాకర్‌రాజు మాట్లాడుతూ ముఖ్యంగా గర్భిణీ, బాలింతలు తమ ఆరోగ్యాల పట్ల ఎంతో జాగ్రత్తగా ఉండాలని, అప్పుడే పుట్టబోయే బిడ్డ, మీరు ఆరోగ్యంగా ఉంటారన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

మహబూబాబాద్ అర్బన్ : చిన్నారులు, విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని గుమ్మడూరు సబ్‌యూనిట్ సెంటర్ వైద్యాధికారి కిరణ్మయి అన్నారు. జిల్లా కేంద్రంలోని నవోదయ హైస్కూల్‌లో తల్లుల నవజాత శిశువుల దినోత్సవం సోమవారం సబ్‌యూనిట్ వైద్యశాఖ ఆ ధ్వర్యంలో తల్లిదండ్రులకు అవగాహన నిర్వహించారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

గూడూరు: వాహనదారులు మద్యం సేవించి నడిపితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై బి. గిరిధర్ రెడ్డి అన్నారు. స్థానిక ప్రధాన బస్టాండ్ సెంటర్‌లో సోమవారం రాత్రి వాహనాల తనిఖీ చేశారు. వాహన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు.

సీసీరోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

గూడూరు : మండల కేంద్రంలోని చెంద్రుగూడెంలోని ఒక వీధిలో సోమవారం ఎమ్మెల్యే మురళీనాయక్ సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా గూడూరులోని శివాలయం వీధిలోని ఒక వీధిలో సీసీ రోడ్డు పనులకు మాజీ సర్పంచ్ రమేశ్‌నాయక్ శంకుస్థాపన చేశారు.

భూ సమస్యను పరిష్కరించాలి

బయ్యారం : మండలంలోని కొత్తపేట పంచాయతీ పరిధిలో కౌలుకు ఇచ్చిన భూమిని కబ్జా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం పలు కులసంఘాలు, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకులు పీరయ్య మాదిగ, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు భీమానాయక్ మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం భూయజమాని కౌలుకు ఇస్తే కొంద రు వ్యక్తులు ఆ భూమిని ఆక్రమించుకున్నారన్నా రు. ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని గిరి జనులకు పంచాలని లేనియెడల ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వేసవికాలంలో జాగ్రత్తలు పాటించాలి

నెహ్రూసెంటర్ : ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, ఉద్యోగులు జాగ్రత్తలు పాటించాలని ఆర్టీసీ డీఎం ఎం.శివప్రసాద్ అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు వేసవికాలం దృష్ట్యా దాత కండక్టర్ తోట నరేష్ టవల్స్‌ను సోమవారం పంపిణీ చేశారు.

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర

కురవి : మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండలంలోని పిల్లిగుండ్ల తండా, తాట్య తండా, కొత్తూరు(జీ), పెద్ద తండా, గుండ్రాతిమడుగు(విలేజ్) గ్రామాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను సోమవారం నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. అలాగే సీరోలు మండలం తాళ్లసంకీసలో మండల పార్టీ అధ్యక్షుడు కొండపల్లి కరుణాకర్ ఆధ్వర్యంలో పాదయాత్ర చేశారు.

జార్జిరెడ్డి మహాసభలను జయప్రదం చేయండి

మహబూబాబాద్ అర్బన్ : హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 10 నుంచి 14 వరకు జరగనున్న అరుణతార యువ మేధావి జార్జిరెడ్డి 53వ వర్ధంతి మహాసభలను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోనగిరి మధు పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జార్జిరెడ్డి వర్ధంతి సభల పోస్టర్‌ను సోమవారం నాయకులు ఆవిష్కరించారు.

చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టాలి

నెల్లికుదురు: చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టే వరకు చెరువు మట్టిని తరలించనివ్వమని మాజీ జెడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డి, రైతులు తెగేసి చెప్పారు. ఆలేరు పరిధిలోని నెల్లికుదురు–మహబూబాబాద్ ప్రధాన రహదారిపై రైతులతో కలిసి సోమవారం ధర్నాకు దిగారు. చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టే వరకు రైతులంతా ఏకమై ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు పంపిణీ

కేసముద్రం: మున్సిపాలిటి పరిధిలోని ఎమ్మార్సీలో జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్ష–అలింకో ఆధ్వర్యంలో ఆరుగురు దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా ఉపకరణాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులపై వారి అభివృద్ధి పట్ల ప్రత్యేక విద్యాబోధకులు చూపే చొరవ అభినందనీయమన్నారు.

పుస్తెమెట్టెలు అందజేత



మహబూబాబాద్ రూరల్ : సేవా రంగంలో ముందుండే ఆర్యవైశ్యులు జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారి వేమిశెట్టి చంద్రయ్య దంపతులు పేద ఆర్యవైశ్య కుటుంబంపై దాతృత్వం చూపారు. నర్సింహులపేట మండలం రామన్నగూడేనికి చెందిన ప్రతాపని రమేష్ దంపతుల కుమార్తె వివాహం మరికొద్ది రోజుల్లో జరుగనుందన్నారు. వారు ఆర్థిక ఇబ్బందుల్లో ఉండగా వివాహ మహోత్సవానికి జిల్లా కేంద్రానికి చెందిన వేమిశెట్టి చంద్రయ్యకు మహబూబాబాద్ ఆర్యవైశ్య సంఘం ద్వారా విషయాన్ని తెలియపరచగా వెంటనే సానుకూలంగా స్పందించి బంగారు (రూ.30 వేల విలువగల) పుస్తెమెట్టెలు, నూతన పట్టువస్త్రాలు అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు

కబడ్డీ పోటీలు ప్రారంభం

కేసముద్రం : మండలంలోని తాళ్లపూసపల్లిలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలను కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నెల్లికుదురు: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రయోజకులను చేసుకోవాలని ఎంఈఓ రాందాస్ కోరారు. సోమవారం మండలంలోని ఆలేరు జెడ్పీఎస్ఎస్ విద్యార్థులకు ప్రభుత్వం అందించిన రవాణా చార్జీల డబ్బులను ఒక్కొక్కరికి రూ.6వేలు అందించారు.

టీవైసీ పట్టణ అధ్యక్షుడిగా చరణ్ గౌడ్

మహబూబాబాద్ రూరల్ : పట్టణ యువజన కాంగ్రెస్ (టీవైసీ) అధ్యక్షుడిగా గాడిపెల్లి చరణ్ గౌడ్ నియామకమయ్యారని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అజ్మీరా సురేష్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డాక్టర్ మురళీనాయక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కంకర అయ్యప్పరెడ్డి సో మవారం చరణ్ గౌడ్‌కు నియామకపత్రాన్ని అందజేశారు.

ఆదివాసీలపై హత్యాకాండను నిలిపివేయాలి

గూడూరు: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై జరిపిస్తున్న హత్యాకాండ దాడులను వెంటనే నిలిపివేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమాక్రసీ సబ్ డివిజన్ కమిటీ నాయకుడు రణధీర్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఈ నెల 20న చలో మహబూబాబాద్ సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు.

సబ్బండ వర్గాల క్షేమమే ప్రభుత్వ ఆకాంక్ష

చిన్నగూడూరు : సబ్బండ వర్గాల క్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ఆకాంక్ష అని డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్ అన్నారు. సోమవారం మండలంలోని తుమ్మలచెరువు తండాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలను చేత పట్టుకుని నినాదాలు చేస్తూ పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

ఊరూరా ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలి

మహబూబాబాద్ అర్బన్ : బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో ఊరూరా నాయకులు పార్టీ ఆవిర్భావ జెండాలు ఆవిష్కరించాలని జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు పిలుపు నిచ్చారు. స్థానిక 24 వార్డు ఇంద్రకాలనీలో సోమవారం బీజేపీ ఆవిర్భావవ పురస్కరించుకొని శక్తికేంద్ర ఇంచార్జీ సందీప్ జెండా ఆవిష్కరించారు.

కేసముద్రం: రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు తుంపిళ్ల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మున్సిపాలిటి కేంద్రంలో, ఉప్పరపల్లి, కాట్రపల్లి, కోరుకొండపల్లి గ్రామాల్లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించి పార్టీ జెండాలను ఎగురవేశారు.

పెద్దవంగర : బీజేపీ ఆవిర్భావ వేడుకలను మండల అధ్యక్షుడు బొమ్మెరబోయిన సుధాకర్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. బూత్ అధ్యక్షుడు జలగం ఆనంద్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు.

గిరిజన సంఘం నాయకుడి ముందస్తు అరెస్ట్

గార్ల : చలో హైదరాబాద్ పిలుపు నేపథ్యంలో గిరిజన సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి హరినాయక్‌ను సోమవారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు.

కురవి: చలో హైదరాబాద్‌కు తరలివెళ్తారని భావించిన స్థానిక పోలీసులు తెలంగాణ గిరిజన సంఘం నాయకులను సోమవారం అదుపులోకి తీసుకున్నారు. కొందరిని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. అలాగే సీరోలు పోలీసులు నాయకులను అదుపులోకి తీసుకుని సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు.